క్లుప్తంగా

ఎమ్మెల్యే కన్నబాబును కలసిన ఎమ్మెల్సీ అభ్యర్థి పద్మశ్రీ



ఎమ్మెల్సీ అభ్యర్థి పద్మశ్రీకి అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన కర్రి పద్మశ్రీ బుధవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో కన్నబాబుకు ఆమె పుష్పగుచ్ఛం ఇచ్చి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పద్మశ్రీను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

భావనారాయణ ఆలయ అభివృద్ధికి కృషి

- ఈఓ భీమ శంకరరావు



బాధ్యతలు చేపడుతున్న భీమ శంకరరావు

కాకినాడ రూరల్: జిల్లాలో పురాతన ప్రసిద్ధి గాంచిన సర్పవరం శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని కొత్తగా బాధ్యతలు చేపట్టిన కార్య నిర్వహణాధికారి భీమ శంకరరావు పేర్కొన్నారు. ద్రాక్షరామం భీమేశ్వర ఆలయంలో సూపరింటెండ్‌గా పదోన్నతిపై వచ్చిన ఆయన బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ కమిటీ, గ్రామస్తులు, భక్తులు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబు సహాయ సహకారంతో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

గురుకుల హాస్టల్ పరిశీలన



బాలికల భోజన వసతి, వంటశాలలను పరిశీలించిన డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి

కాకినాడ క్రైం: స్థానిక సాంబమూర్తినగర్‌లోని బాలయోగి గురుకుల బాలికల వసతి గృహాన్ని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి పరిశీలించారు. దోమల నివారణకు ఉపయోగించే మస్కిటో మెష్షింగ్‌ను పర్యవేక్షించారు. భోజన వసతి, వంటశాల నిర్వహణను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. దోమల వల్ల కలిగే అనారోగ్యాలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బాలికలందరికీ 'ఆరోగ్య విద్య' బోధించారు. అనంతరం జనవరి నెలలో డెంగీ కేసు నమోదైన శ్రీనివాసనగర్‌ను పరిశీలించి దోమల నివారణకు సిబ్బంది చేపట్టిన చర్యలపై ఆరా తీశారు. ఆమె వెంట డీఎంవో భాస్కరరావుతో పాటు మలేరియా నివారణ సిబ్బంది ఉన్నారు.

స్కానింగ్ ధరలు ప్రదర్శించాలి

కాకినాడ క్రైం: స్కానింగ్ కేంద్రాలు ధరల పట్టీని కచ్చితంగా ప్రదర్శించాలని పీసీపీఎన్‌డీటీ రాష్ట్ర అదనపు సంచాలకుడు, రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ కె.అనిల్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాల నిర్వహణ, ఏఆర్‌టీ, సరోగసి కేంద్రాల అనుమతుల అంశాలపై బుధవారం ఆయన జిల్లా అధికారులతో జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. ప్రైవేటు, ప్రభుత్వ స్కానింగ్ కేంద్రాల పనితీరును సమీక్షించారు. స్కానింగ్ కేంద్రాల యాజమాన్యాలు గర్భిణుల వివరాలు తప్పకుండా ఫారం–ఎఫ్‌లో పొందుపరిచి అప్‌లోడ్ చేయాలని సూచించారు. డివిజినల్, ప్రోగ్రాం అధికారుల సమక్షంలో తప్పకుండా డెకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని ఆదేశాలిచ్చారు.

పారిశుధ్య పనుల పరిశీలన

కాకినాడ: స్థానిక జగన్నాథపురం, ఏటిమొగ, గౌరీశంకరపేట ప్రాంతాల్లోని పారిశుధ్య పనులను నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు బుధవారం తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణలో సిబ్బంది మరింత ప్రత్యేక శ్రద్ధతో పనిచేయాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధర్మాజీ, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మూగ వేదన ఇంకెన్నాళ్లు?



నడకుదురులోని పాత పశువుల ఆసుపత్రి (ఫైల్)



రేకులషెడ్డులో నిర్వహిస్తున్న పశువైద్యశాల



నడకుదురులో నాలుగున్నరేళ్లుగా సాగుతున్న ఆస్పత్రి భవన నిర్మాణం

- ముందుకు సాగని ఆస్పత్రి భవన నిర్మాణం
- నాటి పాలకుల హడావుడి పనుల్లో ఇదీ ఒకటి
- నాలుగున్నరేళ్లుగా నత్తనడకన పనులు

కరప: నడకుదురులోని పశువుల ఆసుపత్రి భవన నిర్మాణం ముందుకు సాగక రైతులు, సిబ్బంది అవస్థలు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వం చేసిన హడావుడి శంకుస్థాపనల్లో ఈ భవనం కూడా ఒకటి. నడకుదురులో ఈ భవనాన్ని 1966లో పెంకులతో నిర్మించారు. అప్పటి నుంచి నడకుదురు, పెనుగుదురు, గురజనాపల్లి గ్రామాల రైతుల పశువులకు ఇదే పెద్ద దిక్కు. ఆసుపత్రి ఆవరణ పల్లంగా ఉండడంతో కొద్దిపాటి వర్షం వచ్చినా నీరుపోయే మార్గం లేక పశువుల బోను (ట్రెవీస్) వద్ద నీరు నిలబడిపోయేది. పశువులను తోలుకెళ్లడానికి రైతులు, వైద్యసేవలు అందించేందుకు సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడేవారు. భవనం శిథిలావస్థకు చేరడంతో శిథిలావస్థకు చేరడంతో, ఎన్నికలు సమీపిస్తున్నాయనగా 2018లో టీడీపీ నాయకులు రూ.34 లక్షలు భవన నిర్మాణానికి మంజూరు చేశారు. ఆ యేడాది సెప్టెంబరు 14న అప్పటి ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీ నాయకులతో కలసి భవన నిర్మాణానికి అట్టహాసంగా శంకుస్థాపన చేశారు. తర్వాత కాంట్రాక్టర్ పునాది వరకు గోడలు కట్టి వదిలేశారు. తర్వాత కొంతకాలానికి శ్లాబువేసి వదిలేశారని రైతులు విమర్శిస్తున్నారు. తర్వాత కిటికీలు, గుమ్మాలు పెట్టకుండా గోడలు నిర్మించారు. మరికొంతకాలానికి భవన నిర్మాణం పూర్తికాకుండానే ప్రహరీ నిర్మించి వదిలేశారు.

ఇరుకుగదిలో పశు వైద్యశాల..

గ్రామంలోని పశువుల ఆస్పత్రి భవన నిర్మాణానికి పాత భవనాన్ని తొలగించారు. కొత్త భవనం నిర్మించే వరకు ఎదురుగా ఉన్న రేకులషెడ్డులో ఒకగదిని అద్దెకు తీసుకుని, సామానులు ఉంచి, పశువులకు వైద్య సేవలందిస్తున్నారు. వెటర్నరీ సిబ్బంది, రైతులు చందాలు వేసుకుని పశువుల బోను ఏర్పాటుచేసుకోగా, అరకొర వసతులతోనే సిబ్బంది పనిచేస్తున్నారు. భవననిర్మాణం చేపట్టి నాలుగేళ్లు పైబడినా, పూర్తికాలేదని అధికారులు స్పందించి పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని మూడు గ్రామాల రైతులు కోరుతున్నారు.

టెండర్లు పిలుస్తాం

భవన నిర్మాణ పనుల్లో ఆలస్యం కావడం వాస్తవమే. పనిచేసినవరకూ బిల్లులు చెల్లించాం. తర్వాతపనులుచేసేందుకు ముందుకురాకపోవడం టెండర్ రద్దుచేయాలని గుంటూరు కార్యాలయానికి పంపించాం. కొత్తగా టెండర్ పిలిచి, పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.
– పి.వెంకటేశ్వరరావు, డీఈఈ, మార్కెటింగ్‌శాఖ

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతాం



గ్రామంలో చేపట్టిన పశువైద్యశాల భవనం నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశాం. దీంతో రైతులు, సిబ్బంది ఇబ్బందులను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు దృష్టికి తీసుకెళ్లి, నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరతాం.
– జవ్వాది సతీష్, మాజీ ఎంపీటీసీ, నడకుదురు

ఇరుకు గదితో ఇబ్బంది

పశువుల ఆసుపత్రి భవనం పూర్తికాక ఇరుకు గదిలోనే ఫర్నిచర్, ఫైల్స్, మందులు ఉంచాల్సి వస్తోంది. పశువులకు వైద్య సేవలందించడంలో సిబ్బందికి, రైతులకు ఇబ్బందిగానే ఉంటోంది. గదిలోకి విష సర్పాలు కూడా వస్తున్నాయి. నిర్మాణంపై గ్రామస్తులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ ఎం.రవికిరణ్‌బాబు, మండల పశువైద్యాధికారి, నడకుదురు

ఎమ్మెల్సీల ఎంపికలో సామాజిక న్యాయం

- సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సీఎం వైఎస్ జగన్ సామాజిక న్యాయానికి పెద్ద పీట వేశారని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన వాడబలిజ మత్స్యకార వర్గానికి చెందిన కర్రి పద్మశ్రీతో కలసి ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. సామాజిక న్యాయం విషయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఆచరణలో అమలు చేసిన ముఖ్యమంత్రి వద్ద పనిచేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా కాకినాడకు చెందిన బందన హరి కొనసాగుతున్నారని, వాడబలిజకు చెందిన మహిళకు ఇదే ప్రాంతం నుంచి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారన్నారు. పద్మశ్రీ భర్త నారాయణరావు పార్టీ పట్ల విధేయతతో సుదీర్ఘకాలంగా తనతో కలిసి పనిచేస్తున్నారన్నారు.

'మడ' అడవులంటూ రాద్ధాంతం..

కాకినాడ దుమ్ములపేట ప్రాంతంలో మడ అడవుల ప్రాంతాన్ని ఆక్రమణ చేసేస్తున్నారంటూ రెండు ప్రధాన పత్రికలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే ద్వారంపూడి మండిపడ్డారు. ఆ ప్రాంతం మడ అడవులుగా నోటిపై కాకపోయినా నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు అక్కడి క్రీక్‌ను అధికారులు గతంలో పునరుద్ధరించారన్నారు. స్థలాభావం వల్ల దుమ్ములపేట చుట్టుపక్కల ఉన్న ఎన్నో లారీలను రోడ్డు పక్కనే నిలపడం వల్ల ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలు, ఇతర ఇబ్బందుల దృష్ట్యా ఖాళీగా ఉన్న ఆ ప్రాంతంలో లారీలను నిలుపుతుంటే దానిని కబ్జా అంటూ కథనాలు రాస్తున్నారన్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే కొండబాబులా తప్పుడు పత్రాలు సృష్టించి స్థలాలు కబ్జాలు చేసే నైజం తమది కాదని, వాస్తవాలను వక్రీకరించి ఇలాంటి ప్రచారాలు చేయడం మానుకోవాలని ద్వారంపూడి సూచించారు. శునకాల వల్ల ఎదుర్కొనే సమస్యలను ఇకపై నేరుగా మేనకాగాంధీ దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన ప్రజలకు సూచించారు. ప్రజలు ఆమె మొబైల్ నెంబర్ 09868180604కు కాల్ చేసి చెప్పాలని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, మాజీ మేయర్ శివప్రసన్న, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మత్స్యకార ప్రతినిధి కాటాడి జానకి రామ్, మాజీ డిప్యూటీ మేయర్లు పసుపులేటి వెంకటలక్ష్మి, మీసాల ఉదయ్‌కుమార్, బోడిపల్లి ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

బ్యాంక్ లింకేజీలపై దృష్టి పెట్టండి

- గృహ నిర్మాణాలు వేగవంతం కావాలి
- సమీక్షలో కమిషనర్ రమేష్



గృహ నిర్మాణ ప్రగతిపై సమీక్షిస్తున్న కమిషనర్ రమేష్

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో లబ్ధిదారులకు రూ.35 వేల బ్యాంకు లింకేజీ విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం కొమరగిరి లే అవుట్‌లో గృహనిర్మాణ ప్రగతిపై అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుతో కలిసి హౌసింగ్, ప్రత్యేకాధికారులు, ఇతరశాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. గృహ నిర్మాణాల కోసం సుమారు 9416 మంది అగ్రిమెంట్లు పూర్తి చేసుకోగా, 3,300 ఇళ్లు గ్రౌండింగ్‌లో ఉన్నాయన్నారు. 4,536 మంది లబ్ధిదారులకు రూ.35 వేల చొప్పున బ్యాంకు లింకేజీ పూర్తయ్యిందని, మిగిలిన ఐదు వేల మందికి త్వరితగతిన లింకేజి ప్రక్రియ పూర్తయ్యేలా బ్యాంకర్లతో చర్చించాలని సూచించారు. అలాగే ఎమినిటి కార్యదర్శులు జియో ట్యాగింగ్‌తో పాటు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లింపు ప్రక్రియపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. సీహోలు కూడా ఈ అంశంపై నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా గృహనిర్మాణాల ప్రక్రియ వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా అంశాలపై ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలన్నారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో లక్ష్యాన్ని సాధించాలన్నారు. గృహనిర్మాణశాఖ డీఈ సత్యనారాయణరెడ్డి, నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

నిత్య చైతన్య దీప్తి 'మహాప్రస్థానం'



కార్యక్రమంలో మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక నాయకులు

కాకినాడ సిటీ: శ్రీశ్రీ మహాప్రస్థానం నిత్య చైతన్యదీప్తి అని వక్తలు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి కచేరిపేట యూటీఎఫ్ హోంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శ్రీశ్రీ మహాప్రస్థానం సామూహిక పఠనం నిర్వహించారు. కార్యక్రమానికి యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జి.ప్రభాకరవర్మ అధ్యక్షత వహించి మాట్లాడుతూ అభ్యుదయ ప్రచురణ సంస్థలు ఫిబ్రవరి 21 రెడ్‌బుక్ డేగా నిర్వహించాలని ఇచ్చిన పిలుపులో భాగంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శ్రీశ్రీ మహాప్రస్థానం సామూహిక పఠనం ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ సాహితీవేత్త అద్దేపల్లి ప్రభు మాట్లాడుతూ శ్రీశ్రీ రచనల గొప్పతనాన్ని వివరించారు. సామాజిక కోణంలో రచనలకు శ్రీశ్రీ నాంది పలికారన్నారు. దోపిడీ సమాజాన్ని కూలగొట్టి, సోషలిస్టు సమాజ నిర్మాణ లక్ష్యంగా శ్రీశ్రీ రచనలు సాగాయన్నారు. కార్యక్రమ నిర్వాహకులను అభినందిస్తూ కవితా, ఓ కవితా ఆలపించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ మాట్లాడుతూ పుస్తకం మంచి స్నేహితుడన్నారు. పెన్షనర్ల సంఘం నేత సీహెచ్ సత్యనారాయణరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాదిగలకు ఎమ్మెల్సీ పదవి కేటాయింపు హర్షణీయం



ఎమ్మెల్యే ద్వారంపూడిని సత్కరిస్తున్న మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకులు

కాకినాడ సిటీ: మాదిగలకు ఎమ్మెల్సీ పదవి కేటాయించిన సీఎం జగన్‌కు మహాజన సోషలిస్ట్ పార్టీ కాకినాడ జిల్లా సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి ఆ పార్టీ నాయకులు వల్లూరి సత్తిబాబు, పలివెల నవీన్ కృతజ్ఞతలు తెలిపారు. వారు మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చిన తరువాత ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాదిగలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం లేనేలేదన్నారు. బొమ్మి ఇజ్రాయిల్‌కు ఎమ్మెల్సీ పదవి కేటాయించడం అభినందనీయమన్నారు. జిల్లాలో మరిన్ని పదవులు మాదిగలకు ఇచ్చేలా ఎమ్మెల్యే ద్వారంపూడి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయనను నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా నందిగం సురేష్, ఆదిమూలపు సురేష్, తానేటి వనితలకు కృతజ్ఞతలు తెలిపారు. మాదిగ సంఘం నాయకులు మిరియాల వీరబాబు, పువ్వుల భాస్కరరావు, నరుకుర్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

రాగిజావలో పోషకాలెన్నో..



విద్యార్థులకు రాగిజావ అందజేస్తున్న డీఈవో అన్నపూర్ణ

కాకినాడ రూరల్/కరప: ప్రభుత్వ పాఠశాలల్లో రాగిజావ పంపిణీ చేయడానికి ముందుగా వాకలపూడి జెడ్పీ హైస్కూల్‌లో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఒకటి నుంచి 10వ తరగతి వరకు గల అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాల బాలికలకు ఉదయం 8.45 నుంచి 9 గంటల మధ్యలో రాగి జావా పంపిణీకి వాకలపూడి జెడ్పీ హైస్కూల్‌లో జిల్లా విద్యాశాఖాధికారి అన్నపూర్ణ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించినట్టు హెచ్‌ఎం తెలిపారు. డీఈవో మాట్లాడుతూ ఈ రాగిజావ ద్వారా మంచి పోషక పదార్థాలు అందుతాయని, విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఎంఈఓ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సీఆర్పీ హాజరయ్యారు. అలాగే కరపలో జిల్లా మధ్యాహ్న భోజన పథకం అసిస్టెంట్ డైరెక్టర్ పడాల నాగేశ్వరరావు స్థానిక మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో బుధవారం రాగిజావ ఇచ్చేందుకు ఎంఈఓ కె.బుల్లికృష్ణవేణి అధ్యక్షతన పాఠశాలల హెచ్‌ఎంలు, తల్లిదండ్రులతో మాక్‌డ్రిల్ నిర్వహించి, పథకం గురించి అవగాహన కల్పించారు. మంగళ, గురు, శనివారాల్లో విద్యార్థులకు రాగిజావ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. ప్రతి విద్యార్థికి 150 గ్రాముల రాగిజావ అందించాలన్నారు. ప్రయోగాత్మకంగా రాగిజావ వండించి, ఏడీ నాగేశ్వరరావు, ఎంఈఓ కృష్ణవేణి విద్యార్థులకు అందజేశారు. హెచ్‌ఎంలు వి.వీరభద్రావతి, యు.లీలామనోహర్, వడ్డి వెంకటేశ్వరరావు, డి.బాపిరాజు, సీఆర్పీలు పాల్గొన్నారు.

అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా బుల్లెమ్మ బాధ్యతల స్వీకరణ



పెద్దాపురం: పెద్దాపురం అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జిగా జి.బుల్లెమ్మ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఏలూరు కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తూ న్యాయమూర్తిగా పదోన్నతిపై పెద్దాపురం కోర్టుకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకూ ఆ స్థానంలో విధులు నిర్వర్తిస్తున్న హర్షవర్ధన్ పెద్దాపురం కోర్టులోనే పదోన్నతిపై ప్రిన్సిపాల్ జూనియర్ జడ్జిగా నియమితులయ్యారు. అడిషనల్ జూనియర్ మెజిస్ట్రేట్‌గా విధులు చేపట్టిన బుల్లెమ్మను పలువురు న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

క్రమబద్ధీకరణ కోరుతూ స్టాఫ్ నర్సుల వినతి



ఎంపీ భరత్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

కాకినాడ క్రైం: కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న తమని రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సెస్ వెల్ఫేర్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ చిన్నారి ఆధ్వర్యంలో పలువురు స్టాఫ్ నర్సులు రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌ను మంగళవారం ఆయన కార్యాలయంలో కలసి వినతి పత్రం సమర్పించారు. నర్సుల వినతిపై సానుకూలంగా స్పందించిన ఎంపీ ఈ సమస్యను తప్పకుండా సీఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీని కలిసిన వారిలో అసోసియేషన్ జోనల్ కో ఆర్డినేటర్ ఫిలిప్ సహా రాజమహేంద్రవరం, కాకినాడకు చెందిన స్టాఫ్ నర్సులు ఉన్నారు.

తీరానికి మణిహారం మేజర్ హార్బర్

కొత్తపల్లి: తీరప్రాంతానికి ఉప్పాడ హార్బర్ మణిహారంగా నిలుస్తుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మేజర్ హార్బర్ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 50 ఏళ్ల తీర ప్రాంత ప్రజలు కలలను సీఎం జగన్ నిజం చేశారన్నారు. రూ.422 కోట్లతో ఉప్పాడలో చేపట్టిన మేజర్ హార్బర్ నిర్మాణ పనులు 50 శాతానికి పైగా పూర్తి అయినట్టు తెలిపారు. ఈ హార్బర్ ఆగస్టులో ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. సుమారు 2500 బోట్లు నిలిచేలా, సుమారు లక్షా పది వేల 624 మెట్రిక్ టన్నుల ఎగుమతులు లక్ష్యంగా నిర్మిస్తున్నామన్నారు.

నేడు నూకాలమ్మ తల్లి తొలి గరగ ఉత్సవం

బోట్‌క్లబ్: సూర్యారావుపేట నూకాలమ్మ అమ్మవారి తొలి గరగ ఉత్సవం గురువారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ లక్ష్మణరావు తెలిపారు. బుధవారం ఆలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 26న సూర్యారావుపేటలో సంబరం జరుగుతుందన్నారు. 28న కొత్తపేటలో, మార్చి 2న రామారావుపేటలో, మార్చి 5న సాలిపేటలో, 7న రామారకృష్ణారావుపేటలో, 9న కామేశ్వరినగర్‌లో, 14న పేర్రాజుపేటలో, 16న అగ్రహారంలో, 21న ఆలయం వద్ద కొత్త అమావాస్య సందర్భంగా పెద్ద జాగరం వైభవంగా జరుగుతాయన్నారు. 22న ఉగాది సందర్భంగా శిరిబొమ్మ ఉత్సవం, ఊయల ఉత్సవం, 24న బుక్కా సంబరం జరుగుతాయని ఈఓ తెలిపారు.

సారా కేసులో వ్యక్తికి ఏడాది జైలు, జరిమానా

కాకినాడ లీగల్: సారా తీరలిస్తున్న ఓ వ్యక్తికి ఏడాది జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ స్పెషల్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎం.మాధవి బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కాకినాడ, ఏటిమొగలో కొండబాబు కాలనీకి చెందిన బొబ్బిలి సత్యనారాయణ 2020లో కాకినాడ రెల్లివీధి వద్ద రెండు లీటర్ల సారా తీసుకువెళ్తుండగా కాకినాడ సౌత్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు పట్టుబడ్డాడు. దీనిపై కాకినాడ సౌత్ పోలీసులు కేసు నమోదు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువు కావడంతో సత్యనారాయణకు ఏడాది జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఏపీపీ సీహెచ్ జగదీష్‌కుమార్ ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

బీచ్‌లో వృద్ధురాలి మృతదేహం

సామర్లకోట మండలం పనసపాడుకు చెందిన మహాలక్ష్మిగా గుర్తింపు

కాకినాడ రూరల్: మండలంలోని నేమాం బీచ్‌లో బుధవారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. తిమ్మాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు మృతురాలు సామర్లకోట మండలం పనసపాడుకు చెందిన కనకాల మహాలక్ష్మి (62)గా గుర్తించారు. మృతురాలి భర్త రామారావు ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగి. ఇద్దరు కుమారులు సురేష్, వెంకటేష్‌లలో ఒకరు రంగంపేటలో విశాఖ డెయిరీలోను, మరో కుమారుడు హోమ్ గార్డుగా పనిచేస్తున్నారు. తమ వీధిలో రామాలయం ప్రారంభోత్సవం కోసం సముద్ర స్నానం కోసం బుధవారం ఉదయం తల్లి మహాలక్ష్మి ఆటోలో వెళ్లిందని, తిరిగి రాకపోవడంతో విచారించగా నేమాం బీచ్‌లో మృత దేహం ఉన్నట్టు సమాచారం అందిందని, దీంతో అక్కడకు చేరుకున్నట్టు పెద్ద కుమారుడు సురేష్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఏఎస్సై సత్యనారాయణ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

బ్రాండెడ్ దుస్తుల పేరిట మోసం

మండలంలోని వాకలపూడిలో ఏర్పాటు చేసిన ఎల్‌టీవీ మల్టీ ట్రేడ్ ప్రైవేట్ లిమిటెడ్ తమను మోసం చేసిందని బాధితులు జాయింట్ కలెక్టర్, తరువాత సర్పవరం పోలీసులను బుధవారం ఆశ్రయించడంతో ఎస్సై వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలానికి చెందిన గంధం భవాని, భాగలక్ష్మి మరి కొందరు తమకు ఉద్యోగాలు ఆశ చూపి బ్రాండెడ్ దుస్తుల మార్కెటింగ్ పేరిట సొమ్ములు ఇవ్వకుండా మోసం చేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంతోష్‌కుమార్, మణికంఠ, మహేష్, హేమంత్, నీలిమ, మురళిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

బాలికను తల్లిదండ్రులకు అప్పగించిన ఎస్‌ఐ



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు

సామర్లకోట: ట్రాఫిక్ ఎస్‌ఐ ఒంటరిగా వెళుతున్న బాలికను గుర్తించి ఆమె తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన పట్టణంలో చోటుచేసుకుంది. స్థానిక గౌతమి మోడల్ స్కూలులో ఐదో తరగతి చదువుతున్న పీకే మాధురిని ఆమె తండ్రి లోవబాబు రోజూ మోటారు సైకిలుపై పాఠశాలకు తీసుకువెళతాడు. అయితే మాధురి బుధవారం ఉదయం నడిచి స్కూలుకు వెళతానని చెప్పడంతో దగ్గరే కదా అని ఒప్పుకున్నారు. అయితే లారీ స్టాండ్ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జికి ఒంటరిగా నడిచి వెళ్లిన మాధురి అటు నుంచి ఎటు వెళ్లాలో అర్థం కాక ఆగిపోయింది. తరగతులు ప్రారంభమైనా పాఠశాలకు మాధురి రాలేదని స్కూల్ నుంచి టీచర్లు చెప్పడంతో బాలిక తల్లిదండ్రుల్లో కలవరం మొదలైంది. ఇంతలో ఫ్లైఓవర్ బ్రిడ్జిపై విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ ఎస్‌ఐ అడపా గరగారావు బాలికను ప్రశ్నించి ఆమె పుస్తకాల బ్యాగ్‌లోని డైరీలో ఉన్న ఫోన్ నెంబర్ ఆధారంగా తల్లిదండ్రులకు సమాచారమివ్వడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేసి బాలికను అప్పగించారు.